క్లుప్తంగా

ఫాల్గుణ పూర్ణిమ విశిష్టతపై ప్రచారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫాల్గుణ పూర్ణిమ విశిష్టతపై ఆదివారం త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన మధురానగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ కమిటీ అధ్యక్షుడు జగిరపు సురేష్ హోలీ విశిష్టతను వివరించారు. మన పండుగలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు తాము ప్రచారం చేస్తున్నామన్నారు. అనంతరం మధురానగర్ నేతాజీకాలనీ, వీవీ నరసరాజు రోడ్డు తదితర ప్రాంతాల్లో హోలీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు శంకర్, అప్పల నరసమ్మ, దుర్గారావు, గౌరీ, ఉమా, సూరప్పడు, సూరమ్మ, ప్రవీణ, లక్ష్మి, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధ సేవలు అభినందనీయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద వయోవృద్ధులను గుర్తించి ప్రతీనెలా నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ ఎ.సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సంఘ్వీ నరేంద్రకుమార్ ఒత్మాల్‌జీ ఛాజెడ్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కేవీఎల్ సాజన్, బీ సుజాత, ట్రస్టు సభ్యులతో కలిసి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు వారికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, తట్టి అర్జునరావు మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీ లక్ష్మీ నరసింహారావు, వెంకటేష్, గోదావరి, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతీ వ్యాయామ శాల సమీపంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 5.15 గంటలకు కాకడ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆరు గంటలకు బాబావారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు సహస్ర గులాబీ పూజ, తొమ్మిది గంటలకు శ్రీలక్ష్మీగణపతి, సాయి మూల మంత్ర హోమం, దత్త, నవగ్రహ, నక్షత్ర హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాబావారి ఊరేగింపు, విజయ సాయి ప్రేమమండలి వారితో భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను ట్రస్టీ ఎం.దుర్గాప్రసాద రామకోటేశ్వరరావుశర్మ, ఎం.ప్రశాంత్ విశ్వనాథ్‌శర్మ, కొమండూరి రఘురామ్ పర్యవేక్షించారు.

వాసవి సంస్థల సేవలను విస్తృతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి సంస్థల సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ సంస్థ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. వాసవి ఇంటర్నేషనల్ మొదటి కేబినెట్ మీటింగ్ పాతబస్తీలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హజరతయ్యగుప్తా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు వాసవి సంస్థలు చక్కని సేవలందిస్తున్నాయన్నారు. రానున్న కాలంలో మంచి ప్రణాళికతో వాసవి సంస్థలు ముందుకు దూసుకుపోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన వాసవి గవర్నర్ కొత్త గణేష్‌బాబు మాట్లాడుతూ వాసవి సంస్థలు అందిస్తున్న సేవలను సభకు వివరించారు. వాసవి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పాలకుర్తి గాయత్రి, మామిడి శ్రీనివాసరావు, ఎంవీఎన్ రామచంద్రరావు, తాతా రజనీకుమారి, శనగపల్లి సురేష్, చిట్టూరి శ్రీనివాసరావు, అన్నం సాయి సునీత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తాం

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పవిత్ర మురళి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన పవిత్రమురళి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విశ్వబ్రాహ్మణులంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పవిత్రమురళి అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పవిత్రమురళిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా పవిత్ర మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద విశ్వబ్రాహ్మణులకు చేయూతను ఇచ్చేలా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం జగనన్న ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులంతా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసి వారి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. సెంట్రల్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించేందుకు విశ్వబ్రాహ్మణులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని.. విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి రానున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు జవ్వాది సుధీర్, వీరవల్లి బ్రాహ్మణాచారి, చల్లపల్లి మోహన్‌రావు, పెంట సాయికిరణ్, చిప్పాడ కామేష్, కొండ్రు రామ్మోహన్, అప్పలాచారి, ప్రభాకర్, బుచ్చారావు పాల్గొన్నారు.



హాజరైన విశ్వబ్రాహ్మణులు

పెరిగిన కనెక్టివిటీ.. వైద్య సదుపాయాలు



దేవీనగర్‌లో నిర్మించిన ఆరోగ్యకేంద్రం



జీవీఆర్ నగర్‌లో సిటీ బస్సు

- అభివృద్ధి పథంలో 30వ డివిజన్
- రూ. 1.30 కోట్లతో పట్టణ ఆరోగ్య కేంద్రం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు పొలాలుగా ఉండే(గద్దేవారి పొలాలు) ఈ ప్రాంతంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారు. అయితే ఇక్కడి ప్రజలకు అవసరమైన కనీస వసతులు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం రోడ్లు కూడా వేయలేదు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి ఇక్కడ ప్రత్యేక చొరవతీసుకుని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. ఏ వసతులు లేని ఈ ప్రాంతం ప్రస్తుతం రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

సిటీ బస్సు సర్వీసులు..

పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల కోసం ఈ ప్రాంతానికి 3డీ సిటీ బస్సు సదుపాయం కల్పించారు. ఒకప్పుడు ఆటోలు తప్ప మరో గత్యంతరం లేని ఇక్కడకు సిటీ బస్సు సౌకర్యం కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మెయిన్ రోడ్డు పనులు పూర్తయితే మరిన్ని సిటీ సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అధునాతన సౌకర్యాలతో పట్టణ ఆరోగ్య కేంద్రం..

30వ డివిజన్‌లో ఏ అనారోగ్య సమస్య వచ్చినా మధురానగర్‌కు గానీ, అజిత్‌సింగ్‌నగర్‌కు గానీ వెళ్లాల్సి వచ్చేది. కనీసం బుధవారం వేసే వ్యాక్సిన్‌లు, పల్స్ పోలియో వంటి వాటి కోసం కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1.30 కోట్లతో అధునాతన సదుపాయాలతో ఆరోగ్య కేంద్రంను నిర్మించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోలో మరిచిపోయిన బ్యాగ్ గుర్తింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటోలో మరిచిపోయిన బ్యాగును గుణదల పోలీసులు రెండు గంటల్లో గుర్తించి బాధితులకు అందజేశారు. గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం కనకదుర్గ గుడి వద్ద కొంత మంది విద్యార్థులు ఆటో ఎక్కారు. గుణదల రాంగోపాల్ థియేటర్ వద్ద విద్యార్థులు ఆటో దిగిపోయారు. కొంతసేపటికి ఆటోలో బ్యాగ్ మరిచిపోయినట్లు గుర్తించారు. సదరు బ్యాగులో బంగారు చెవిదిద్దులు ఉన్నాయి. దీంతో గుణదల పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ వాసిరెడ్డి శ్రీను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సదరు ఆటోను గుర్తించి బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. కేవలం రెండు గంటల్లోనే పోయిన బ్యాగును తమకు అందజేసిన గుణదల పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చిన రెండేళ్ల బాలుడిని భవానీపురం పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఉదయం భవానీపురం వెలంపల్లి కాలనీకి చెందిన రెండున్నరేళ్ల బాలుడు ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తల్లిదండ్రులు బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిన విషయాన్ని గమనించలేదు. బాలుడు నడుచుకుంటూ క్రాంబే రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ వద్దకు చేరుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ కృష్ణ సిబ్బందిని పంపారు. బాలుడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని సురక్షితంగా అప్పగించిన సీఐ కృష్ణ, భవానీపురం పోలీసు సిబ్బందికి బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమించి టీడీపీ సమావేశం

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పార్టీ సమావేశాన్ని నిర్వహించడంతో స్థానికులు తమ ఇబ్బందిని అధికారులకు తెలియజేశారు. ఆదివారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించడానికి పార్టీ నాయకులు అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే రాత్రి 10 గంటల వరకు సమావేశాన్ని నిర్వహిస్తూ స్థానికులకు అసౌకర్యం కలిగించేలా సౌండ్ పొల్యూషన్ చేస్తూ సమావేశాన్ని నిర్వహించినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించడాన్ని కొందరు అధికారులు టీడీపీ నాయకులను హెచ్చరించినా పట్టించుకోకుండా సమావేశాన్ని నిర్వహించడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమావేశం నిర్వహణపై సంబంధిత ఎంసీసీ అధికారులు టీడీపీ నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే

ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి జర్నలిజంకు ఉందని, దిగజారిపోతున్న వ్యవస్థలను నిలబెట్టేది మీడియానేనని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఐలాపురం రామా ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో 'సార్వత్రిక ఎన్నికలు–మీడియా పాత్ర' అనే అంశంపై ఆదివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. పత్రికల స్వేచ్ఛ, హక్కుల కోసం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉందని అయితే ఎలక్ట్రానిక్ మీడియాకు అలాంటి వ్యవస్థ లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న చట్టాన్ని కేంద్రం రద్దు చేసి జర్నలిస్టులను మెడికల్ రిప్రజెంటేటివ్స్ కేటగిరీలో చేర్చిందన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డిని జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సదస్సులో ప్రొఫెసర్ ఎంసీ దాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

ఏసీపీ ప్రసాద్



రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ ప్రసాద్, సీఐ వెంకటనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నార్త్‌జోన్ ఏసీపీ డి.ప్రసాద్ రౌడీ, సస్పెక్ట్ షీటర్లను హెచ్చరించారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్, క్రైమ్ సస్పెక్ట్ షీటర్స్, లా అండ్ ఆర్డర్ సస్పెక్ట్ షీటర్స్‌కి ఏసీపీ ప్రసాద్, సీఐ వెంకటనారాయణ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పద్ధతి మార్చుకుని సత్ప్రవర్తతో కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలన్నారు. రౌడీ షీటర్స్‌పై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, హద్దు మీరి ప్రవర్తించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు నార్త్ జోన్ ఏసీపీ డి.ప్రసాద్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రసాద్ రౌడీషీటర్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు, మత్తు పానీయాల అమ్మకాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక సీఐ ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు: నున్న గ్రామ శివారు రామచంద్రాపురం అడ్డరోడ్డు వద్ద నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు జరిగాయి.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



30వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు ఆధ్వర్యంలో 30వ డివిజన్‌కు చెందిన 25 మంది టీడీపీ నాయకులు, 57వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు ఆధ్వర్యంలో 50 మంది పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రజలకు మరింత ఉజ్వల భవిష్యత్తు అందించాలంటే ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడాలని ఎమ్మెల్యే వెలంపల్లి పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఏడుకొండలు, వాసా ఆదినారాయణ, దేవర రవికుమార్, మాణిక్యాల రవికుమార్, త్రివేణి, రామస్వామి తదితరులు ఉన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



సమష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తున్న గురువులు..



మధురానగర్‌లో మట్టలతో చిన్నారులు

గుణదల (విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు లోకానికి వెలుగని, ఆయన ద్వారానే మానవాళికి పాప క్షమాపణ లభించిందని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. గుణదల పుణ్యక్షేత్రంలో మానికొమ్మల ఆదివారం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజాబలి కార్యక్రమంలో ఫాదర్ జయరాజ్ భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ మానవుడికి సన్మార్గాన్ని ఏసుక్రీస్తు చూపారని పేర్కొన్నారు. పాపాన్ని విడిచిపెట్టి శాంతి,సమాధానాలతో జీవించాలని ఆయన బోధనలు చెబుతున్నాయని వివరించారు. బెత్లహేం సంప్రదాయం ప్రకారం మ్రానికొమ్మ (మట్ట)లతో క్రీస్తుకు జేజేలు పలికారని గుర్తుచేశారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. పుణ్యక్షేత్ర గురువులు, భక్తులు మ్రానికొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర గురువులు గాబ్రియేల్, సునీల్ రాజు, తదితరులు హాజరయ్యారు.

దీనుల కోసం భూలోకానికి క్రీస్తు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దీనులను, దరిద్రులను ఉద్ధరించడానికే క్రీస్తు భూలోకానికి వచ్చారని రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఆదివారం మట్టల దినోత్సవం సందర్భంగా సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యాన విశ్వాసులు, చిన్నారులు ఈత మట్టలు చేతబూని పురవీధుల్లో క్రీస్తును స్తుతిస్తూ ఏసు సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఏసు ప్రభువు తనను తాను రాజుగా ప్రకటించుకున్న రోజన్నారు. ఇంతటి పవిత్రమైన రోజు ప్రజలందరికీ ఎంతో దీవెనకరమన్నారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు.

మధురానగర్‌లో..

మధురానగర్‌లో జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యాన మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఫెలోషిప్ వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో జీసస్ ప్రేయర్ పెలోషిప్ సభ్యురాలు విజయరాణి, పెద్ద సంఖ్యలో చిన్నారులు, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం లోకాన్ని రక్షించాలంటూ లోక రక్షకుడైన ఏసు ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనలు జరిగాయి.

పాయకాపురం(విజయవాడరూరల్): పవిత్ర మట్టల ఆదివారం పురస్కరించుకొని కండ్రిక, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, శాంతినగర్ ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. దావీదు కుమారునికి జయమని, ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతించబడునని కండ్రికలో ఎస్ఏసీ చర్చిలో ప్రవక్తలు ప్రసంగం చేశారు.

పవిత్ర మట్టల ఆదివారంలో వెలంపల్లి ...



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో పవిత్ర మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని గెత్సెమెని, హోసన్నా, బేతనియా, బేతేలు ప్రార్థన మందిరాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. జగనన్న ప్రభుత్వం చర్చిల్లోని పాస్టర్లకు గౌరవ వేతనం అందజేస్తోందని పేర్కొన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ పవిత్రమైన ఓటును ఫ్యాను గుర్తుకు వేసి జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, కొక్కిలిగడ్డ నాని, ఆర్‌కే మహేష్, సతీష్, రామకృష్ణ, చిన్నారి, విమల, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్రవ పదార్థాలు, సీజనల్ పండ్లు అధికంగా తీసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా ఎటువంటి సైడు ఎఫెక్టులు లేకుండా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చని తెలిపారు. ఇంట్లో ఉండే మహిళలు తరచూ తాగునీటిని తీసుకోవాలని సూచించారు. తగినంత నీటిని తీసుకోకపోవడం వల్ల యూరినరీ ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం 350 మందిని ఉచితంగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి



మేకప్‌మెన్ గణపతిని సత్కరిస్తున్న శంకరరావు, నీలం దుర్గారావు

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ఆంధ్రఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డొగిపర్తి శంకరరావు అన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నెల వారీ సాంస్కృతిక కార్యక్రమాలు, మనస్సాక్షి సాంఘిక నాటక ప్రదర్శన, మేకప్‌మెన్ గణపతికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. డొగిపర్తి శంకరరావు మాట్లాడుతూ ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ద్వారా విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ తెలుగు నేల కళా సాంస్కృతిక రంగాలకు ప్రసిద్ధిచెందిదన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి నందివాడ నాని, హనుమంతరాయ గ్రంథాలయ కార్యదర్శి నీలం దుర్గారావు, సినీ, రంగస్థల నటుడు అనంత హృదరాజ్, బోడి ఆంజనేయరాజు, బుర్రా నవీన్, సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ పాల్గొన్నారు. మేకప్ మెన్ గణపతిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. హర్షక్రియేషన్స్ విజయవాడ వారి మనస్సాక్షి సాంఘిక నాటికను ప్రదర్శించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ఆర్టీసీ వర్కు షాపు రోడ్డుకు చెందిన చెన్ను చెన్నకేశవరావు శనివారం ఉదయం పని మీద ఎర్రకట్ట వైపు వెళ్తుండగా, పాలప్రాజెక్టు వైపు నుంచి కొత్తపేటకు వెళ్తున్న ద్విచక్ర వాహనం చెన్నకేశవరావు బైక్‌ను ఢీ కొట్టగా అతను కింద పడ్డాడు. ఇంతలో తేరుకుని పైకి లేస్తుండగా, తనను ఢీ కొట్టిన వాహనం ఐరన్ పార్టు మోకాలికి తగలడంతో తీవ్ర గాయమైంది. బాధితుడిని భవానీపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: పరమేశ్వరి పాటల పల్లకీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఆపాత మధురాలు పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలు, మాధవపెద్ది సత్యం, భానుమతి తదితరులు గానం చేసిన పాటలను ఆలపించారు. విశ్రాంత పంచాయతీ రాజ్ అధికారిణి వెంకాయమ్మ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు, సీహెచ్ చిట్టిబాబు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీమణులు సత్యవతి, దయామణి, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మితోపాటు పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు పరమేశ్వరిని గాయనీగాయకులు ఆత్మీయంగా సత్కరించారు.